

# అపరంజి

— మాధవి

"ప్రేమకోసమై వలలో పడెనే పాపం పసివాడు"

హమ్మయ్య! ఆయన వచ్చేశారు టైమ్‌లోగా వస్తారో రారో అని ఒకటే టెన్షన్ ఏ దేవుడోగాని నా మొర ఆలకించాడు. థాంక్ గాడ్! ఆ సంతోషంలో నాకు ఆ ఈలపాట నాదస్వరంలా వినిపించింది ఒక్క ఉదుటన వెళ్ళి తలుపు తీశాను

"ఏమిటో విశేషం?" నన్ను తప్పించుకుని లోపలికి వస్తూ అన్నారు మైగాడ్! పట్టేశారు

"ఏముంది? ఏమీలేదు" అద్దం వైపు తిరిగి చేతిలోవున్న సగం అల్లిన జడను పూర్తిగా అల్లుకుంటూ సాధ్యమయినంత మామూలుగా అన్నాను.

"నువ్వు లేదన్నా, వుందని అద్దంలో నుండి నీ ముఖమే చెప్తోంది"

"మరింక అడగటం దేనికి?" అక్కడ వుండకుండా వంటగదిలోకి వెళ్ళిపోయాను. తిరిగి నేను టిఫిన్ ప్లేటుతో వచ్చేసరికి కుర్చీలో కూర్చుని నింపాదిగా షూస్ విప్పుకుంటున్నారు

"తీసుకోండి."

"ప్రయాణం ఎక్కడికో ముందు చెప్పు" ఆయన ముఖం చూస్తుంటే నాకు నవ్వాగటంలేదు. షాపింగుకని ఎక్కడ అంటానో అని భయం అందులోను అది నెలలో నాలుగవ వారం కాబట్టి ఆ భయం మరికాస్త స్పష్టంగా కనిపిస్తోంది అలా కాసేపు ఏడిపించాలని మనసులో కోరికగా వుంది. కాని మరోవైపు టైమయిపోతోంది.

"అది కాదండీ, రేఖ పిక్చర్ కెళదామంటేమూ..."

"నువ్వు సరేనన్నావు" కొండంత బరువు దిగిపోయినట్లు తేలిగ్గా ఊపిరి పీల్చుకుని నాచేతిలోనుండి ప్లేటు తీసుకున్నారు

"నాకయితే అసలు వెళ్ళాలనిలేదు. నిజానికి తలనొప్పిగా కూడా వుంది. కాని తనేమో ఏమయినాసరే వెళ్ళాలని పట్టుపట్టింది ఈ రోజే ఆఖరు రోజట."

గబగబా చెప్తున్న నన్ను చూసి ఆయన పకపక నవ్వారు. దాంతో పొలమారింది చిన్నబుచ్చుకున్నా మంచినీళ్ళగ్లాసు అందివ్వక తప్పలేదు నాకు

"వెళ్ళొద్దని నేననలేదుకదా! ఎందుకలా పారం అప్పచెప్తావు ఒకటో తరగతి పిల్లలాగా? నీకు తలనొప్పిగా వుండటం, ఆవిడ కాదు కూడదు అనటం, గత్యంతరం లేక నువ్వు సరే ననటం ఇదంతా మామూలేకదా!" ఖాళీగ్లాసు క్రిందపెడుతూ ఇంకా నవ్వుతూనే అన్నారు

దానితో నాకూ నవ్వొచ్చేసింది అదీ నిజమే. ఆయన ఎప్పుడూ వద్దనరు నేనే ఏదో గిల్టీగా ఫీలవుతాను దాన్ని కప్పిపుచ్చుకోటానికి అలా అడగకుండానే సంజాయిషీ చెప్తుంటాను

"అవును కానీ శలవురోజు కూడా ఇంట్లో వుండకుండా ఇదుగో ఇప్పుడే వస్తాను అని ఎప్పుడనగా వెళ్ళారు? ఇప్పుడు గుర్తొచ్చిందా ఇల్లు?" అన్నాను చిరుకోపాన్ని తెచ్చిపెట్టుకుని

"అవునుసుమా! టైమెంతయిందో చూడు, ఎదున్నర" వాచీవున్న ఎడమ చేతిని నా ముందుకి చాపారు

అంతే! నేను మళ్ళీ మాట్లాడలేదు ఒక్క ఉదుటున గదిలోకి వెళ్ళి తలుపేసుకున్నాను కాని ఆయన చిన్నగా నవ్వుకోవటం నా దృష్టిని దాటిపోలేదు

నిజానికి నాకు అసలు సమస్య ఇప్పుడే ప్రారంభం అవుతుంది ఏ చీర కట్టుకోవాలి అనేదే ఆ సమస్య నవ్వకండి మరి!

రేఖకి వున్న చీరల్లో నాలుగో వంతు లేవు నాకు అలాంటిది నేనే ఈ సమస్యతో సతమతమవుతుంటే మరి రేఖ ఏం చేస్తుంది? అయితే ఒకటి! మొత్తం ఎన్ని వున్నా షాపింగుకని, షికారుకని, ఫంక్షన్స్‌కని, పేరంటాలకని, వేసవికాలానికని, చలికాలానికని, ఇలా సీజన్‌వారీగా సందర్భానికి సరిపోయేలా వుంటయ్ తనకి

చీరల సెలక్షన్ కూడా ఆర్టే అయితే అది రేఖ దగ్గరే నేర్చుకోవాలి ఆ మాటకొస్తే ఒక్క చీరల సెలక్షనే కాదు, అందంగా చీర కట్టుకోవటం దగ్గర నుండి ఇంటిని అందంగా అలంకరించుకోవటం వరకు రేఖ దగ్గరే నేర్చుకోవాలి

అందుకే నాకు రేఖ అంటే ఇష్టం ఇరవై నాలుగు గంటలు ఇంట్లో వుండి, ఇంటి పని తప్ప మరో పని లేని నాకు తీరిక వున్నట్లనిపించదు రేఖ లేడీస్ క్లబ్ మెంబరు మహిళామండలి సెక్రటరి ఎప్పుడూ ఏవో సాంఘిక కార్యక్రమాల్లో తలమునకలవుతూ వుంటుంది అయినా ఇంటిని, ఇంటి పనిని నిర్లక్ష్యం చెయ్యదు ఇంటిని చూసి ఇల్లాలిని చూడమన్నట్లుంటుంది

నా చేతులు యాంత్రికంగా చీరల మడతలు విప్పిపెడుతుంటే మనసు రేఖ చుట్టూ తిరుగుతోంది

ఈ కాలనీలో నాలుగేళ్ళనుండీ వుంటున్నా నాకు ఎవ్వరితోను పెద్దగా పరిచయం లేదు దానికి నా స్వభావమే కారణం కావచ్చు నేను ఒక్కదాన్నే సంతానం కావటంవలన చిన్నప్పుడు ఇంట్లో అమ్మ, నేను మాత్రమే వుండేవాళ్ళం నాన్నగారు ఆఫీసుకి అంకితం అయిన మనిషి మా అమ్మది అదో తరహా, తన పనేమిటో, తనేమిటో! అవసరం అయితే తప్ప మాట్లాడేది కాదు ఆ విధంగా నేను చాలా రిజర్వ్‌డుగా తయారయ్యాను అదే అలవాటు చొప్పున స్కూల్లో కూడా ఎవరితోను కలిసేదాన్ని కాదు. ఎవరితోటయినా మాట్లాడాలంటే ఏమనుకుంటారో అని భయం ఆ అలవాటే ఇక్కడికొచ్చినా పోలేదు ఇరుగు పొరుగు వాళ్ళు

నన్ను మాలకాకి అనుకుంటున్నారని ఆలశ్యంగానే అయినా తెలిసి బాధపడ్డాను

అలాంటిది రేఖవాళ్ళు మా ఎదురింట్లోకి వచ్చిన తరువాత నేను ఒంటరితనాన్ని పూర్తిగా మర్చిపోయాను ఒకరోజు తనంతట తానే వచ్చి పరిచయం చేసుకుంది రేఖ నేను ఆశ్చర్యపోయాను ఎందుకంటే మనిషిని చూస్తుంటేనే తెలుస్తోంది చాలా వున్నత కుటుంబంలో నుండి వచ్చిందని దానికితోడు అందానికి నిర్వచనంగా వుంది. అప్పటి వరకు నాకో గట్టి నమ్మకం వుండేది – గొప్పవాళ్ళు తమకంటే తక్కువస్థాయిలోవున్న వాళ్ళతో కలవరని అలా నన్ను ఆశ్చర్యంలో ముంచెత్తిన రేఖ అంతటితో వూరుకోలేదు నా నమ్మకాన్ని వమ్ముచేసి సామాన్య మధ్య తరగతి గృహిణి నయిన నాకు మంచి స్నేహితురాలయింది నాకు రేఖ ఒక్కర్తే తెలుసు కాని సొసైటీ లేడీగా తనకి చాలా మందితో పరిచయాలుంటయ్ నిజానికి తనతో సాటిరాగల వాళ్ళు వాళ్ళే అయినప్పటికీ నాతోనే ఎక్కువ చనువుగా వుంటుంది

రేఖలాంటివాళ్ళు వెయ్యికి ఒక్కరయినా వుంటారా అని నా అనుమానం అన్నివిధాలా వున్నతురాలయినా గర్వం ఏ మాత్రం లేదు పైగా నిరాడంబరతలోనే అందం, ఆనందం వున్నాయంటుంది నా మీద తనకి ఇష్టం ఏర్పడటానికి నా నిరాడంబరతే కారణం అంటుంది తనని చూస్తుంటె అన్నీ వున్న విస్తరి అణిగే వుంటుందని చిన్నప్పుడు మా ప్రక్కింటి బామ్మగారు అనే మాటలు గుర్తొస్తుంటయ్

తన చలాకీతనంతో నాలో కూడా ఉత్సాహాన్ని పుట్టించిన రేఖ అంటే ఆయనకీ అభిమానమే అంతేకాక మరో కారణం కూడా వుంది ఆయనకి సినిమాలంటే అంత ఆసక్తి వుండదు అందులోను తెలుగు సినిమాలంటే తలనొప్పి నాకోసం తప్పనిసరిగా తెలుగు సినిమాలు చూసి తలనొప్పి కొనితెచ్చుకోవలసి వచ్చేది రేఖ వచ్చాక ఆ బాధ తప్పిపోయింది రేఖకి తెలుగు సినిమాలిచ్చి కాబట్టి ఇప్పుడు నేను ఇది వరకట్లా నాకు తోడుగా తనకిష్టంలేని తెలుగు సినిమాలకి రమ్మని సాధించటంలేదు. అందుకు ఒక విధంగా రేఖకి ఋణపడి వున్నానంటారు

"అమ్మా! ఆంటీ నిన్ను త్వరగా రమ్మంటున్నారు లేటయిపోతోందట" రేఖ వాళ్ళ బాబుతో ఆడుకుంటున్న నాని వచ్చాడు కాబోలు, బయటనుండి పిలుస్తున్నాడు

"పోతే పోయిందిలేరా! లోపల మీ అమ్మ ఎంత బిజీగావుందో! డిస్టర్బ్ చెయ్యొచ్చా? తప్పకదూ!" వాళ్ళ నాన్నగారి వాక్బాణాలు

నిజంగానే చీర మార్చుకోటానికని వచ్చిన నేను రేఖ ఆలోచనలలోపడి చేసిన పని బీరువాలో వున్న బట్టలన్నీ సొగులు పెట్టటం ఇంకా ఇలాగే వుంటే ఆయన ఎగతాళి, రేఖతో చివాట్లు తప్పవు కళ్ళు మూసుకుని చేతికొచ్చిన చీర తీసుకుని కట్టేసుకున్నాను

"ఆరుంపావులోనుండి ఐదున్నర తీస్తే ఎంతరా నాని!" నేను తలుపు తియ్యటం చూసి నాని నడిగారు

"ముప్పావు" వాడు బుద్ధిగా సమాధానం చెప్పాడు

"ముప్పావుగంట" నా ముఖంలోకి చూస్తూ నొక్కి పలికారు

నేను అదేమీ వినిపించుకోనట్లు సీరియస్‌గా అన్నాను—"నానికి భోజనం "

"పెట్టేస్తాను "

"టానిక్ వెయ్యటం మర్చిపోరుగా!"

"సోను "

"ఇంకేదో చెప్పాలనుకున్నాను కాని గుర్తురావటం లేదు "

"ఇప్పుడిక గుర్తురాదు కాని వచ్చి తీరిగ్గా ఆలోచించుకుందువుగాని వెళ్ళు ఆవిడకేమయినా సహాయం చెయ్యాలేమో" ఇంకా అక్కడ నిలబడితే ఇంకేమంటారోనని మాట్లాడకుండా వచ్చేశాను

గేటు తీస్తూ అనుకున్నాను, రేఖ ఇంకా రెడీ కాకుండా వుంటే బాగుండునని ఎప్పుడూ నాదే ఆలశ్యం అవుతుంది

రంగురంగుల పూలు విరబూసిన రకరకాల మొక్కలు సాయంకాలపు చిరుగాలికి తలలూపుతుంటే నన్ను ఆహ్వానిస్తున్నట్లే వుంటుంది రేఖ మంచి టేస్ట్‌కి మరో చక్కటి ఉదాహరణ గార్డెన్, కాలు కదపటానికయినా ఖాళీ స్థలం వుండని అద్దె ఇళ్ళలోనే బ్రతుకు గడిచిపోయే నాకు గార్డెనింగ్‌మీద వుండే అభిరుచి తీరకుండానే అణగారిపోయింది

అలా మొక్కల్ని పరికించి చూస్తుంటే శ్రీకాంత్‌గారి స్కూటరు కనిపించింది అంటే ఆయన ఇంట్లోనే వున్నారన్న మాట అలా వుండటం అనేది చాలా అరుదయిన విషయం

మెట్లెక్కుతుంటే అల్సేషియన్ నా దగ్గరకొచ్చి అలవాటు ప్రకారం తోకాడించుకుంటూ వెళ్ళిపోయింది

హాల్లో ఎవ్వరూ లేరు ప్రక్కనున్న బెడ్ రూమ్‌లో నుండి రేఖ నవ్వు గట్టిగా వినిపిస్తోంది ఆ తరువాత వినిపించిన రేఖ మాటలు నా అడుగు ముందుకు పడనీయకుండా నన్ను నిలబెట్టేసినయ్

"ఇంతేనా నన్ను మీరు తెలుసుకుంది? కల్పనలో వున్న గొప్పతనం చూసి కాదండీ నేను తనతో స్నేహం చేసేది. నాకున్నవేవీ కల్పనకి లేవు అందుకే కావాలని తనతో స్నేహం పెంచుకున్నాను తెల్లగీత స్పష్టంగా కనిపించాలంటే నల్లగోడమీదే గియ్యాలి అదే తెల్లగోడమీద గీస్తే ఎంత తెల్లగీత అయినా వెలవెలబోతుంది అలాగే నేను నా సొసైటీలో వాళ్ళ ప్రక్కన వుంటే నేను వున్నంత ఫాషనబుల్‌గా వాళ్ళూ వుంటారు నేను పెట్టుకున్నన్ని నగలు వాళ్ళూ పెట్టుకుంటారు నేను కట్టుకున్నంత ఖరీదు చీర వాళ్ళూ కట్టుకుంటారు ఇంక చూసే వాళ్ళకి నా ప్రత్యేకత ఏం కనిపిస్తుంది? అదే కల్పనతో వెళ్తే తన ప్రక్కన నేను దేదీప్యమానంగా వెలుగుతుంటాను నా ముందు తను వెలవెలబోతుంది అందుకే నేను కల్పననే వెంట తీసుకెళ్తాను పాపం! పూర్ కల్పన మొదట్లో తనూ నాలాగా వుండాలని ప్రయత్నం చేసింది కాని నేను సింప్లిసిటీ అని ఊదరగొట్టే సరికి అలాగే వుండటం మొదలుపెట్టింది ఒకో రంగు కనిపించాలంటే మరో రంగు వుండి తీరాలిసిందే" మళ్ళీ పగలబడి నవ్వుతోంది రేఖ శ్రీకాంత్ ఏదో అంటున్నారు నాకు అదేమీ వినిపించటం లేదు వెనక్కి తిరిగి ఇంటిదారి పట్టాను

నలుపు తెలుపు తెలుపు నలుపు రేఖ మాటలు, నవ్వు నా చెవుల్లో హోరెత్తుతున్నయ్ తెలుపు కంటె నిర్మలంగా కనిపించే రేఖ 'అసలు రంగు' ఇదా? ★




